క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం



నగదు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డిలు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మండలంలోని మైసూరావారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మౌలాకు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి సహకారంతో రూ.1.50లక్షలు కొరముట్ల అందజేశారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ అధికారంలో ఉన్నా, లేకున్నా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పేదలకు, అండగా ఉంటుందని తెలిపారు. కార్యకర్తల కష్టాలలో ఉన్నాడంటే ఆదుకోవడం నాయకుడి ధర్మం అని తెలిపారు. అన్ని వేళలా నియోజకవర్గ కార్యకర్తలను గుండెల్లో పెట్టిచూసుకుంటానని ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణారెడ్డి, బత్తల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

రామాపురం : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని యూనియన్ బ్యాంక్ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటైనా యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ ఖతాదారులకు మెరుగైన సేవలందించడమే తమ బ్యాంక్ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడికి నమ్మకమైన సేవలు అందించడమే తమ ధ్యేయమన్నారు. డ్వాక్రా సంఘాలకు రూ.20 లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ లోకనాథం, సిబ్బంది దామోదర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, ప్రదీప్, ఆదినారాయణ, ప్రసాద్, నాగభూషణ్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ టార్గెట్ బాల్ టోర్నీ పోస్టర్ల ఆవిష్కరణ



సౌత్‌జోన్ టార్గెట్ బాల్ టోర్నీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి(జగదాంబ సెంటర్) : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి పట్టణంలో ఈ నెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు జరగబోయే సౌత్‌జోన్ టార్గెట్ బాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సౌత్‌జోన్ టార్గెట్ బాల్ టోర్నీ పురుషులు, మహిళల విభాగంలో పోటీలు నిర్వహించబడునని ఏపీ టార్గెట్ బాల్ ట్రెజరర్ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు వీరాంజనేయులు, రెడ్డయ్య, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.


నివాళి



కృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

పుల్లంపేట : అనంతయ్యగారిపల్లి సొసైటీ సింగల్ విండో మాజీ చైర్మన్ కసిరెడ్డి కృష్ణారెడ్డి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కసిరెడ్డి కృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో కుమార్‌రెడ్డి, తురక శ్రీనివాసులురెడ్డి, రంగారెడ్డి, రామసుబ్బారెడ్డి, దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యవసరాల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య పేదలకు సహాయపడాలనే లక్ష్యంతో వారికి ప్రతి నెలా ఉచితంగా సరుకులు పంపిణీ చేస్తున్నట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు తిరునామాల కుమార్ తెలిపారు. స్థానిక అమ్మవారిశాల బాలాలయంలో గురువారం కామిశెట్టి చంద్రశేఖర్, సరస్వతిల సహకారంతో అమృత కలశం ద్వారా పేద ఆర్యవైశ్య కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేమా కిషోర్‌బాబు, గాదంశెట్టి సుమన్‌కుమార్, సత్యనారాయణ, గోపి, ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోడూరుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మొదటి సారిగా రైల్వే కోడూరుకు శుక్రవారం (నేడు) రానున్నారు. గురువారం అధికారులు, కూటమి నేతలు కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాస్థాయి అధికారులు, పోలీసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని మైసూరావారిపల్లికి జనసేనలో ప్రత్యేక స్థానం ఉంది. పార్టీకి గెలిచిన ఏకైక పంచాయతీ ఇదే. అందువల్ల ఇక్కడి గ్రామసభకు పవన్ కల్యాణ్ పాల్గొంటున్నారు. అయితే ఎన్నికల ముందు సభలో కూటమి నాయకులు చంద్రబాబు, పవన్‌లు ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు హామీలు ఇచ్చి ప్రజలలో ఆశలు రేకెత్తించారు. కానీ ఇప్పటికి వరకు ఒక హామీని చేసింది లేదు. అలానే నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ గెలుపు కోసం సభలో అనేక హామీలు ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రతి ఇల్లు తిరిగి నియోజకవర్గ అభివృద్ధి కాకుండా సూపర్‌సిక్స్ పైన ప్రచారాన్ని కేంద్రీకరించారు. హామీ అమలుపై ఈ సభలో స్పష్టత ఇస్తారేమోనని నియోజకవర్గ ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అలానే నియోజకవర్గ అభివృద్ధికి వరాలజల్లు కురిపిస్తారేమోనని ఇక్కడి ప్రజలు ఆశాభావంగా ఎదురు చూస్తున్నారు.



గ్రామ సభ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసిన అధికారులు

పార్టీలోని లుకలుకలు సర్దుబాటు చేసేనా?

రైల్వేకోడూరు జనసేన పార్టీ వర్గ పోరు, విభేదాలు గతంలో బయటపడ్డాయి. గతంలో జరిగిన జనసేన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే హాజరవుతారని ప్రచారం చేసినప్పటికీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరుకాలేదు. నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు రెండు వర్గాలుగా ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు. జనసేన అధినేత ఎన్నికల అనంతరం మొదటిసారిగా ఈ ప్రాంతానికి వస్తుండటంతో నియోజకవర్గంలోని పార్టీ కేడర్‌లో ఉన్న లుకలుకలను పరిష్కారంపై దృష్టి సారిస్తారంటూ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నియోజకవర్గంలోని పార్టీ కార్యక్రమాలు అన్ని ఒక నాయకుడి కనుసన్నల్లోనే జరుగుతుండటంతో ఈ విషయమై కేంద్ర పార్టీ కార్యాలయానికి, జనసేనానికి ఫిర్యాదులు వెళ్లినట్టు సమాచారం.

నిద్ర మేలుకున్న హైవే అధికారులు



పోలీస్ స్టేషన్ వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రైల్వేకోడూరు మైసూరువారిపల్లి గ్రామసభకు శుక్రవారం హాజరుకానుండటంతో గురువారం రాత్రి హైవే అధికారులు ఉన్నఫలంగా నిద్రమేలుకొని పట్టణంలోని పలుచోట్ల ప్రధాన రహదారిపై రోడ్డుకు మరమ్మతులు చేస్తున్నారు. ఇంతకాలం పట్టించుకోని అధికారులు డిప్యూటీ సీఎం వస్తుండటంతో హడావిడిగా ఏర్పాట్లు చేస్తుండటంతో పలువురు కోడూరు వాసులు అధికారులపై పెదవి విరుస్తున్నారు.

కనీసం వారానికి ఒక ముఖ్య నాయకులు మా ఊరుకి వస్తుంటే అధికారుల తీరు మెరుగుపడటమే కాక కోడూరు అభివృద్ధి చెందుతుందని వాపోతున్నారు. కాగా రోడ్డుకు మరమ్మతులు చేస్తుండటంతో పోలీస్ స్టేషన్ నుంచి గంగమ్మ గుడి వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది.

వధూవరులకు ఎమ్మెల్యే ఆకేపాటి ఆశీర్వాదం

రాజంపేట రూరల్ : పలు వివాహ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి వధూవరులను ఆశ్వీరదించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఉన్న దేవాలయాల సముదాయంలో గురువారం తన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి మందపల్లికి చెందిన మోడపోతుల నరసింహులుకు ఎమ్మెల్యే వివాహం జరిపించారు. అనంతరం వధూవరులను ఆశ్వీరదించారు. ఆకేపాడు పంచాయతీలోని పెద్దూరు గ్రామంలో చంటయ్య కుమారుని వివాహ వేడుకలో, ఎమ్మెల్యే ఆకేపాటి పీఏ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పిల్లి మారుతీరావు సోదరుడి వివాహ వేడుకలలో పాల్గొని వధూవరులను ఆశ్వీరదించారు. నారంరాజుపల్లిలో సుబ్బరాయుడురాజు, మదనమోహన్‌రాజు నూతనంగా ఏర్పాటు చేసిన టిఫిన్ సెంటర్ ఎమ్మెల్యే ఆకేపాటి ప్రారంభించారు. అనంతరం నిశ్చితార్థ వేడుక, గృహ ప్రవేశ, దశదిన కర్మకాండ కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎస్టేట్‌లో జిల్లాలోని పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉచిత వివాహం జరిపించి వధూవరులను ఆశ్వీరదిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అండగా నిలుద్దాం

రైల్వేకోడూరు అర్బన్ : ఎయిడ్స్ వ్యాధిని అవగాహనతోనే అరికట్టగలమని, వ్యాధిగ్రస్తులు మహమ్మారిని ధైర్యంగా ఎదుర్కొనేలా సహకరిద్దామని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ మూర్తి తెలిపారు. గురువారం స్థానిక కాలేజీలో విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మనచుట్టూ మనకు తెలీకుండా ఎంతో మంది ఈ మహమ్మారితో బాధపడుతున్నారని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్న వారికి ధైర్యం కల్పించేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

పుల్లంపేట : గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి సర్పంచ్‌లను ఆదేశించారు. గురువారం ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి రైల్వేకోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుందామన్నారు. సభ ద్వారా తెలియజేసిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు తాగునీటి మోటార్లకు మరమ్మతులు చేయించి గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అలానే కేతరాజుపల్లి నుంచి చిన్నంపల్లి వరకు, ఎగువరెడ్డిపల్లి నుంచి బోటుమీదపల్లి నరసింహ స్వామి దేవాలయం వరకు తారురోడ్డు మరమ్మతులు నిర్వహించడం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అనంతరం సంబంధిత అధికారులు పలు సమస్యలపై చర్చించారు. అనంతరం డాక్టర్ సానే శేఖర్ మాట్లాడుతూ 104 ద్వారా ప్రతి గ్రామంలో ప్రజలకు ఇంటివద్దనే వైద్యం చేయిస్తున్నామన్నారు. ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా రైతులకు కావాల్సిన పనులు చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోగా వెంకటసుబ్బమ్మ, జయశంకర్, జెడ్పీటీసీ గీతాదేవి, తహసీల్దార్ అరవింద కుమార్, ఎంపీడీఓ రఘురాం, విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్, ఎంఈఓలు నాగా తిరుమలరావు, చక్రాధర్ రాజు, వెటర్నరీ డాక్టర్ సుధీర్, మండల కన్వీనర్ ముస్తాక్, సర్పంచ్‌లు ఆకేపాటి శ్రీనివాసులు, దొండ్లపల్లి మణికంఠ, ఎంపీటీసీ శైలజారెడ్డి, ఆలం చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

తూకాలలో అవకతవకలు జరిగితే చర్యలు

లక్కిరెడ్డిపల్లి : నిత్యవసర సరుకుల పంపిణీ తూకాలలో అవతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని కొలతలు, తూనికల శాఖ కడప అసిస్టెంట్ కంట్రోలర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లి పౌర సరఫరాల గిడ్డంగిని ఆయన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకాలు సరిగా ఉన్నాయా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించారు. చౌక దుకాణం డీలర్‌ను గోదాముకు పిలిపించి గోదాము ఇన్‌చార్జ్ సమక్షంలో నిత్యవసర సరుకులను సరిగా తూకాలు వేసి ఇస్తున్నారా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి చౌక దుకాణానికి 100 శాతం తూకాలు వేసి సరుకులను సరఫరా చేయాలని గోదాము ఇన్‌చార్జ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో గోదాము ఇన్‌చార్జ్ మల్లికార్జున బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



గోదాంలో సిబ్బందితో కలిసి తనిఖీ చేస్తున్న తూనికలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రవీంద్రారెడ్డి

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

రాయచోటి అర్బన్ : కలకత్తాకు చెందిన జూనియర్ డాక్టర్ హత్యాచార కేసులో నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్రనేత నాగేంద్రబాబు, జిల్లా కన్వీనర్ వెంకటరమణలు డిమాండ్ చేశారు. కలకత్తా హత్యాచార సంఘటనను నిరసిస్తూ గురువారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు పీఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. వారు మాట్లాడుతూ కలకత్తా ఆర్‌జీ కార్ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్‌పై హత్యాచార సంఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. కాగా సంఘటన జరిగి 10 రోజులవుతున్నా కేసులో నిందితులను పట్టుకోవడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ మండిపడ్డారు. పైగా కేసును తప్పుదారి పట్టించేందుకు సీఎం స్వయంగా ఆందోళనకు దిగుతుండడం దారుణమన్నారు. సంఘటనకు బాధ్యత వహించి పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ తన పదవికి రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. దేశంలో మరెక్కడా ఇటువంటి సంఘటనలు జరుగకుండా ఉండాలంటే విద్యార్థిని, మహిళా విద్యాసంస్థల వద్ద పోలీసులతో ప్రత్యేక నిఘా పెట్టించాలన్నారు. మహిళలు పనిచేసే సంస్థల్లో ప్రత్యేక రక్షణను కల్పిస్తూ చట్టాన్ని తీసుకురావాలన్నారు. బాధితురాలి కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. తక్షణమే నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలంటూ కోరారు.



బాలికల జూనియర్ కళాశాల ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించొద్దు

సిద్దవటం : గ్రామంలో ప్రశాంత వాతారణానికి ఎవరూ విఘాతం కలిగించవద్దని ఎస్ఐ చిరంజీవి అన్నారు. మండలంలోని మాచుపల్లె గ్రామంలో బుధవారం రాత్రి గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ మాచుపల్లెలో పలువురికి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల ఎవరైనా తిరుగుతున్నా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నా డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ రాజు, పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ చిరంజీవి

విద్యార్థులకు డ్రాయింగ్ బుక్స్ పంపిణీ



క్లబ్ సభ్యులు అందించిన డ్రాయింగ్ పుస్తకాలతో విద్యార్థులు

రాయచోటి అర్బన్ : రోటరీక్లబ్ సభ్యులు గురువారం పట్టణంలోని బేతల్‌కాలనీ ప్రభుత్వ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ పుస్తకాలను పంపిణీ చేశారు. దాత మునగా నవీన్‌కుమార్ ఆర్థిక సౌజన్యంతో డ్రాయింగ్ బుక్స్, క్రయాన్స్‌ను 150 మంది విద్యార్థులకు అందజేశారు.

అభివృద్ధి వేదికలుగా గ్రామ సభలు

సంబేపల్లె : అభివృద్ధి వేదికలుగా గ్రామ సభలను వినియోగించుకుందామని గురువారం మండల ప్రత్యేక అధికారి తేజస్విని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో స్వర్ణ గ్రామ పంచాయతీలో నాలుగు టీంలు ఏర్పాటు చేయాలి. అందులో భాగంగానే ఉపాధి హామీ పథకం, మరుగుదొడ్లు, డ్రైనేజీ, గ్యాస్ సౌకర్యం, కుళాయి కనెక్షన్, వీధిలైట్లు, సీసీ రోడ్లు తదితర సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులతో కలిసి నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సునీల్ కుమార్, ఉపాధి ఏపీఓ, అధికారులు పాల్గొన్నారు.

సుండుపల్లె : మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో శుక్రవారం గ్రామ సభలు జరుపుతామని ఉపాధి హామీ ఏపీఓ మాలిక్ బాషా అన్నారు. గురువారం ఆయన కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. గతంలో చేపట్టిన ఉపాధి హామీ పనులు, ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న పనుల స్థితి, ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై పూర్తి స్థాయిలో గ్రామ సభలలో చర్చ ఉంటుందన్నారు. గ్రామ సభలకు ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ వేతనదారులు, రైతులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

గ్రామ సభలను విజయవంతం చేయండి

పెనగలూరు : మండలంలో శుక్రవారం నిర్వహించనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి చెంగల్రాయుడు, ఎంపీడీఓ వరప్రసాద్‌లు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సచివాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బందిలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఏర్పాటు చేయనున్న గ్రామ సభలను సచివాలయ సిబ్బంది విజయవంతంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీకి రైతులకు కావాల్సిన పనులను గుర్తించేందుకు ఈ గ్రామసభ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సుబ్బరాయుడు, ఏపీఓ మురళీ, సచివాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సంబేపల్లె: సిబ్బందికి మార్గదర్శకాలు తెలియజేస్తున్న అధికారి తేజస్విని

గాలివీడులో..

గాలివీడు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 23న శుక్రవారం ప్రారంభించనున్న గ్రామసభలను మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభలను గ్రామ సర్పంచ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శిల సహకారంతో అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు – ప్రణాళికా ప్రక్రియను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తాగునీటి సౌకర్యం, విద్యుత్, మరుగుదొడ్లు, డ్రైనేజీ, సీసీ రోడ్లు వంటి వాటిపై చర్చించడం జరుగుతుందన్నారు.



పెనగలూరు: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి చెంగల్రాయుడు, ఎంపీడీఓ వరప్రసాద్‌లు

అధికారులు తప్పక హాజరుకావాలి

చిన్నమండెం : నేడు జరగబోవు గ్రామసభలకు సిబ్బంది అందరూ తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ ఎం.దివ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా జరిగే గ్రామసభలకు పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, సర్పంచులు ఉపాధి పనులు, గ్రామ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు తదితర అంశాలను సేకరించి నివేదికను ఉన్నతాధికారులకు అందించాలన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సరస్వతమ్మ

వీరబల్లి : అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నడపాలని సూపర్‌వైజర్ సరస్వతమ్మ తెలిపారు. గురువారం పెదవీడు సెక్టార్‌లో అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తున్న ఆహార పోషక పదార్థాలను పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు సకాలంలో అందజేయాలని చెప్పారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనాలు వడ్డించాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జేసీబీ యంత్రంతో పిచ్చిమొక్కలను తొలగించే చర్యలు చేపట్టామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఎంతో ఉన్నతమైన స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులు ఎలాంటి సమస్యలు లేకుండా మంచి వాతావరణంలో ఉండేలా ఉన్నాతాధికారుల ఆదేశాలతో పాఠశాల పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భజన



ఆలయంలో ఆలపిస్తున్న భజన గీతాలు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన వినాయక స్వామి ఆలయంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. తలమంచి రమణారెడ్డి ఏర్పాటు చేసిన ఈ భజన భక్త బృందం వినాయక స్వామికి సంబంధించిన భక్తి గీతాలు, అన్నమాచార్య గీతాలు ఆలపించారు. 41 రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

వివాదాస్పద ప్రభుత్వ భూమి పరిశీలన

సిద్దవటం : కనుమలోపల్లె గ్రామ సమీపంలో సర్వే నెంబర్–70లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావడంతో గురువారం పరిశీలించామని తహసీల్దారు మురాషావలి తెలిపారు. ఆయన మాట్లాడుతూ కంతా పిచ్చమ్మ అనే మహిళ సర్వే నెం.70లో ఉన్న ప్రభుత్వ భూమిలో 5 సెంట్లు స్థలంఓ రాజమాత గుడిని నిర్మించుకొని పూజలు చేసుకుంటోందని, ఆ స్థలంలో ఉన్న గుడిని మద్రిపల్లె రవిశంకర్ అనే వ్యక్తి తొలగించి ఆక్రమించుకొని కాశీమాత గుడిని నిర్మించారని ఆమె జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో వివాదాస్పద స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఇరువురి అభిప్రాయాలు తీసుకొని, నివేదికను ఉన్నాతాధికారులకు సమర్పిస్తామని తహసీల్దారు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఇరువురితో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విచారణ చేస్తారని హాజరుకావాలని వారికి తెలియజేసినట్టు ఆయన అన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ నాని, సర్వేయర్ నరేష్, సర్పంచ్ ప్రతినిధి తుర్రా ప్రతాప్, నాగం నరసింహారెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిని అధికారులతో కలసి పరిశీలిస్తున్న తహసీల్దారు మురాషావలి

వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం

నందలూరు : రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అధికారి ఎస్.రాజశేఖర్ పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విఫ్స్ కార్యక్రమాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన కౌమార బాల బాలికలకు రక్తహీనత, మాదకద్రవ్యాల నిర్మూలన, ఆత్మహత్యల నివారణ, పౌష్టికాహారం, మానసిక ఒత్తిడి, లైంగిక సుఖ, అసంక్రమిత రోగాలు గురించి అవగాహన కల్పించారు. పాటూరు వెల్నెస్ సెంటర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీషర్ షర్మిల మాట్లాడుతూ పేదరికం, నిరక్షరాస్యత, మేనరికపు సంబంధాల కారణంగా పిల్లలకు చిన్నతనంలోనే వివాహాలు చేయడం వల్ల, బాల్య వివాహాలతో నెలలు నిండకుండా బరువు తక్కువగల శిశువులు జన్మించే అవకాశాలు అధికంగా ఉండి మాంద్యం, తెలివితేటలు తక్కువగా ఉండటం, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. ఏఎన్ఎం సంపూర్ణ మాట్లాడుతూ కౌమార దశ అనేది చాలా విలువైనది, ఈ దశలో వ్యక్తిగత పరిశుభ్రత అనేది ముఖ్యమన్నారు. అనంతరం ఆశ కార్యకర్త శిల్ప, శ్యామలాలు బాల బాలికలకు ఐరన్ టాబ్లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు మాధవీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తహీనత, మాదక ద్రవ్యాల నిర్మూలన గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

బాలవిహార్‌లో చిన్నారుల ప్రసంగం



బాలవిహార్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న విద్యార్థులు

రాజంపేట రూరల్ : వైఎస్సార్ కడపలోని రేడియో కేంద్రంలో ఫ్యూచర్ మైండ్స్ స్కూల్ విద్యార్థులు బాలవిహార్ కార్యక్రమంలో పాల్గొని గురువారం ప్రసంగించారు. అత్తిరాల పుణ్యక్షేత్రం గురించి వివరించారు. అదే విధంగా అన్నమాచార్య కీర్తనలు, దేశభక్తి గేయాలను ఆలపించారు. పర్యావరణం పరిరక్షించేందుకు మట్టిగణపతిని పూజిద్దామని తెలియజేశారు. ముఖ్యంగా ఎల్‌కేజీ విద్యార్థి జతిన్ చేసిన ప్రతిజ్ఞ ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు సుజిత, అనుపమ, వరలక్ష్మి, శివశంకర్, గంగాధర్‌లు విద్యార్థులకు సహకారం అందించారని చెప్పారు.